సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



విజయీభవ

చైనాలో జరుగుతున్న ఆసియన్ క్రీడల్లో పతకాలు సాధించేందుకు విశాఖ క్రీడాకారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. 8లో



హృదయం.. పదిలమేనా?

జీవన శైలిలో మార్పులు, అధిక బరువు, రక్తపోటు, మధుమేహం తదితర సమస్యలతో గుండె లయ తప్పుతోంది. 8లో



హాస్టల్ సముదాయం ప్రారంభం

ఏయూలో శ్రీకృష్ణదేవరాయ వసతి గృహాన్ను వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. 8లో

మురుగు.. మెరుగు

సోలార్ జిగేల్



ముడసర్లోవ ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్

అందమైన మహా విశాఖ నగరం.. ఇప్పుడు తన రూపురేఖలను మరింతగా మార్చుకుని నూతన సొబగులు అద్దుకుంటోంది. కొత్త రోడ్లు.. బస్ బేలు.. ప్రధాన కూడళ్లు, రోడ్ల విస్తరణతో అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. మరో వైపు విద్యుత్ అవసరాలను సొంతంగా తీర్చుకునేందుకు 20 నుంచి 25 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లతో పాటు భీమిలిలో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ వ్యవస్థ ఏర్పాటుకు జీవీఎంసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకు కోసం రూ.700 కోట్లతో 25 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు శుద్ధి చేసిన నీటిని పరిశ్రమ అవసరాలకు విక్రయించేందుకు సిద్ధమవుతోంది.

- రూ.150 కోట్లతో 20 నుంచి 25 మెగావాట్ల సోలార్ ప్లాంట్
- మేహాద్రిగెడ్డ, ముడసర్లోవలో ఏర్పాటుకు అవకాశాలు
- భీమిలిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ
- రూ.700 కోట్లతో 25 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్‌టీపీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రస్తుతం 50 మెగావాట్ల మేర విద్యుత్‌ను వినియోగిస్తోంది. ఇప్పటికే ముడసర్లోవలో 2 మెగావాట్లు, మేహాద్రి గెడ్డలో 3 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. అలాగే చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌ను కాపులుప్పాడలో కొనసాగుతోంది. దీని సామర్థ్యం 10 మెగావాట్ల మేర ఉంది. అయితే ఇక్కడ ఉత్పత్తయిన విద్యుత్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో రూ.150 కోట్లతో 20 నుంచి 25 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ప్రధానంగా మేహాద్రి గెడ్డతోపాటు ముడసర్లోవలో నీటిపై తేలియాడే సౌర ఫలకాలను అమర్చడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. ఇందుకోసం అవసరమయ్యే నిధుల సమీకరణ కోసం ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖతో జీవీఎంసీ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది. త్వరలో ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తయారుచేసేందుకు జీవీఎంసీ సన్నాహాలు చేస్తోంది. ఈ సోలార్ ప్లాంటుకల ఏర్పాటైతే తన సొంత విద్యుత్ అవసరాల్లో 60 శాతానికిపైగా విద్యుత్‌ను సొంతంగా ఏర్పాటు చేసుకున్న మొదటి నగరపాలక సంస్థగా జీవీఎంసీ అవతరించనుంది. అలాగే భీమిలిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థ ఏర్పాటుకు జీవీఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. సుమారు రూ.700 కోట్లతో 25 ఎంఎల్‌డీ సామర్థ్యంతో సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) ఏర్పాటుకు అధ్యయనాన్ని ప్రారంభించింది.

పీపీపీ పద్ధతిలో..



ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో వివిధ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. నగర పరిధిలో కొత్త రోడ్ల ఏర్పాటుతో పాటు వార్డుల వారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ప్రాజెక్టులను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో చేపట్టాలని జీవీఎంసీ ప్రాథమికంగా నిర్ణయించింది. రూ.150 కోట్లతో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్లు, రూ.700 కోట్లతో ఏర్పాటు చేయనున్న భీమిలి యూజీడీ, ఎస్‌టీపీలను పీపీపీ పద్ధతిలో చేపట్టనున్నట్టు తెలుస్తోంది. 25 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్‌టీపీతో మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి పారిశ్రామిక అవసరాలతో పాటు రానున్న రోజుల్లో ఏర్పాటుకానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ అవసరాలకు కూడా సరఫరా చేసే విధంగా ప్రణాళిక రచిస్తున్నారు. దీంతో ఆదాయాన్ని కూడా జీవీఎంసీ ఆర్జించే అవకాశం కలగనుంది. ఇప్పటికే విస్కోస్ ద్వారా మురుగు నీటిని శుద్ధి చేసి స్టీల్ ప్లాంటుతో పాటు పలు పరిశ్రమలకు జీవీఎంసీ నీటిని సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే.

ఆరోగ్య సురక్ష పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను విజయవంతంగా నిర్వహించేందుకు గాను మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 30వ వరకు విలేజ్ హెల్త్ క్లినిక్స్, అర్బర్, రూరల్ పీహెచ్‌సీల పరిధిల్లో డోర్ టూ డోర్ ప్రచారం, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారు. దీనికి ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, అధికారులు సహకారం అందిస్తారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

మండలం	ప్రత్యేక అధికారి
పద్మనాభం	ఎస్‌డీసీ, ఎన్‌హెచ్–16, విశాఖ
భీమిలి	ఆర్డీవో, భీమిలి
ఆనందపురం	ఎస్‌డీసీ (కేఆర్ఆర్‌సీ, విశాఖ
విశాఖ రూరల్	ఎస్‌డీసీ, ఎల్ఏ, స్టీల్‌ప్లాంట్
సీతమ్మధార	జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ (శానిటేషన్,రెవెన్యూ)
మహారాణిపేట	జీవీఎంసీ అడిషనల్ కమిషనర్
గోపాలపట్నం	జిల్లా సివిల్ సప్లయిస్ ఆఫీసర్
ములగాడ	జిల్లా జంతుసంరక్షణ అధికారి
గాజువాక	ఎస్టేట్ ఆఫీసర్, వీఎంఆర్‌డీఏ
పెదగంట్యాడ	జిల్లా సహకార అధికారి
పెందుర్తి	ఆర్‌డీవో, విశాఖపట్నం

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకటరమణ



జస్టిస్ వెంకటరమణకు అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రాన్ని ఈవో అందజేశారు.

ఈఎన్‌సీలో విజన్ 2047 సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విశ్రాంత నేవీ అధికారులు

సింధియా: తూర్పు నావికాదళం(ఈఎన్‌సీ) ఆధ్వర్యంలో మారిటైమ్ వార్‌ఫేర్ సెంటర్‌లో ఇండియన్ నేవీ విజన్–2047 అనే అంశంపై గురువారం సెమినార్ ప్రారంభమైంది. ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఈ సెమినార్‌ను ప్రారంభించారు. విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు, దౌత్యవేత్తలు, శాస్త్రవేత్తలు, విశ్రాంత నేవీ అధికారులు పాల్గొని.. పలు అంశాలపై చర్చించారు. 2047 ఆగస్టు 16న తెరిచే టైమ్ క్యాప్సూల్స్ ప్రొసీడింగ్ పత్రాలను అధికారులకు అందజేశారు.

జీవీఎంసీలో పదోన్నతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో పని చేస్తున్న ముగ్గురు మున్సిపల్ కమిషనర్లకు పదోన్నతి లభించింది. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ హోదాతో కార్యదర్శిగా పని చేస్తున్న పల్లి నల్లనయ్యను సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా, ఫస్ట్‌గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ హోదాతో జెడ్సీగా పని చేస్తున్న బొడ్డేపల్లి రాము, డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న సీహెచ్ సత్యనారాయణలను స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు విధులు నిర్వర్తిస్తున్న స్థానాల్లోనే వీరు కొనసాగనున్నారు.

జూలో 2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 12 ఏళ్లలోపు వయసు గల పిల్లలకు జూలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్, బర్డ్‌వాక్, ఫొటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు, ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 94411 30894ను సంప్రదించవచ్చు.

ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల సుబ్బారెడ్డి సంతాపం

మహారాణిపేట: హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ లాంటి ఎన్నో పురస్కారాలను అందుకున్న మహోన్నత వ్యక్తి స్వామినాథన్ అన్నారు. స్వామినాథన్ కుమార్తె సౌమ్య స్వామినాథన్‌ను సుబ్బారెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

ప్రవక్త జీవితం శాంతి సందేశం



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

- భక్తి శ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ
- భారీ శాంతి ర్యాలీ, ప్రత్యేక ప్రార్థనలు

డాబాగార్డెన్స్: మహ్మద్ ప్రవక్త (రసూలల్లా సల్లాల్లాహీ అలైహి వసల్లం) జన్మదినమైన మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీరత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నగరంలో వివిధ మసీదుల నుంచి భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్ప్రింగ్ రోడ్డులోని రిజర్వ్‌లైన్ మసీదు వద్ద ప్రారంభమైన శాంతి ర్యాలీ డాల్ఫిన్ జంక్షన్, మహిళా కళాశాల, సెవెన్‌హిల్స్, జగదాంబ జంక్షన్, టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్, కురుపాం మార్కెట్ మీదుగా పాతనగరంలోని హజ్రత్ ఇషాక్ మదినీ ఔలియా దర్గా వరకు సాగింది. ఇందులో భాగంగా వివిధ మసీదుల కమిటీలు తయారు చేసిన ముస్లింల పవిత్ర స్థలాలు మక్కా, మదీనా మోడళ్లతో, ఇస్లామిక్ జెండాలు చేత బట్టి గుర్రాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం వివిధ మసీదు కమిటీల ఆధ్వర్యంలో ఫాతెహ నిర్వహించారు. ప్రసాద వితరణ జరిగింది. సీరత్ కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఐహెచ్ ఫరూఖీ, కార్పొరేటర్లు బర్కత్ ఆలీ, మహ్మద్ సాధిక్, ముస్లిం పెద్దలు మహ్మద్ నజీర్, హైదర్ ఆలీ షింకా, మెహబూబ్ షరీఫ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారానికి హామీ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

బీచ్‌రోడ్డు: నగర అభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ కేంద్రంగా విజయదశమి నుంచి పరిపాలన ప్రారంభం కానున్న నేపథ్యంలో.. జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వై.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ పరిపాలన రాజధానిగా విశాఖ అన్ని రకాలుగా అనుకూలమైన నగరమన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు విశాఖను రాజధాని చేయకుండా.. తన స్వార్థ ప్రయోజనాల కోసం అమరావతిని ఎంపిక చేశారని ఆరోపించారు. గ్రాఫిక్స్ బొమ్మలు చూపించి.. ప్రజలను మాయచేశారన్నారు. జీవీఎంసీ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బకాయిలను త్వరలోనే చెల్లిస్తామన్నారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వందల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించారన్నారు. పెండింగ్ బిల్లుల సమస్యను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్తానన్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు చాలా వరకు బిల్లులు మంజూరు చేశామన్నారు. మరికొన్ని బిల్లులను త్వరలోనే చెల్లిస్తామన్నారు. నగర అభివృద్ధిలో కాంట్రాక్టర్లు చురకైన పాత్ర పోషిస్తున్నారన్నారు.

16న ఇన్ఫోసిస్ ప్రారంభం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్ 16న ఇన్ఫోసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. రాష్ట్రంలో పరిపాలన రాజధాని అయ్యే అన్ని సాకర్యాలు కలిగిన ఏకైక నగరం విశాఖ అని అన్నారు. దేశంలో నూతనంగా ఏర్పడిన ఈ రాష్ట్రమైనా.. అభివృద్ధి చెందిన నగరాలనే రాజధానులుగా ఏర్పాటు చేసుకుందన్నారు. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్, జీ–20 సదస్సులు విజయవంతం కావడంలో కాంట్రాక్టర్లు ముఖ్య భూమిక పోషించారన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం, అధ్యక్షుడు గొంపల చంద్రమౌళి, డిప్యూటీ మేయర్ శ్రీధర్, నాన్ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు లజపతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి అవకాశాలు

- ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి
- గోరింటలో ఎక్సైజ్ శాఖ కాంప్లెక్స్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో నిర్మాణ పనులకు శంకుస్థాపన



డిపో నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం: మండలంలోని కణమాం పంచాయతీ గోరింటలో ఎక్సైజ్ శాఖ కాంప్లెక్స్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో నిర్మాణంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి చెప్పారు. ఇక్కడ రూ.20 కోట్లతో నిర్మించనున్న ఎక్సైజ్ శాఖ కాంప్లెక్స్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో నిర్మాణ పనులకు గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడే మరో వంద కోట్లతో డిపోను విస్తరించే అవకాశం ఉండడంతో స్థానికులు ఎంతో లబ్ధిపొందనున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషితో భీమిలి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని వివరించారు. విశాఖకు రాజధాని రానుండడంతో గ్రామీణ ప్రాంతాలు ఉపాధి, ఉద్యోగావకాశాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించనున్నాయని చెప్పారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో ఇటీవల ఈ ప్రాంతంలోనే 50 ఎకరాల్లో ఆటోనగర్ నిర్మాణానికి అంకురార్పణ చేశామన్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ భీమిలి అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తున్నారని మళ్లీ ఆయన్ని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలోనే విశాఖ రాజధాని ఏర్పాటు కానుండడంతో అన్ని రంగాలలోను అభివృద్ధిని సాధించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు తరలి రానుండడంతో పర్యాటక రంగం అభివృద్ధి చెంది స్థానికంగానే యువతకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజిత్ భార్గవ్, రాష్ట్ర కమిషనర్ వివేక్ యాదవ్, రాష్ట్ర బేవరీస్ కమిషనర్ వాసుదేవ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాసులు, సర్పంచ్ ఆబోతు అప్పలరాము, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పినిశెట్టి సింహాచలం నాయుడు, యర్ర అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహన మిత్రలో విశాఖదే పైచేయి

- నాలుగు విడతల్లో రూ.125.54 కోట్ల అందజేత
- నేడు ఐదో విడత నిధుల జమ

గోపాలపట్నం: వైఎస్సార్ వాహన మిత్ర పథకంలో భాగంగా ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేల ప్రభుత్వ సాయం అందివ్వడంలో విశాఖ ఆర్టీఏ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. 2019–20లో 32,778 మంది లబ్ధిదారులకు రూ.32.77 కోట్లు, 2020–21లో 38,001 మందికి రూ.38.01 కోట్లు, 2021–22లో 34,059 మందికి రూ.34.05 కోట్లు అందజేసినట్లు చెప్పారు. జిల్లాల విభజన తర్వాత 2022–23లో 20,711 మంది లబ్ధిదారులకు రూ.20.71 కోట్లు అందించామన్నారు. 2023–24 ఏడాదిలో 21,134 మందికి రూ.21.13 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో రూ.125.54 కోట్లు అందజేసినట్లు వెల్లడించారు. కాగా.. వాహనమిత్ర ఐదో విడత నిధులను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేయనున్నారు.

విజయీభవ

- ఆసియాడ్ పతకమే లక్ష్యంగా విశాఖ క్రీడాకారులు
- ఇప్పటికే టెన్నిస్‌లో సాకేత్ జోడీ సెమీస్‌కు చేరిక

విశాఖ స్పోర్ట్స్: ఒలింపిక్స్‌లో పతకం సాధించడం ఒక కల. ఆసియాడ్‌లో పతకం సాధించడం ఒక లక్ష్యం. అది సాధించే అవకాశం మన విశాఖ క్రీడాకారులకు వచ్చింది. ఆసియన్ దేశాల్లో ప్రతి ఒక్క క్రీడాకారుడి లక్ష్యం నెరవేర్చుకునేందుకు ప్రస్తుతం చైనాలోని హాంగ్జౌ వేదికగా ఆసియన్ గేమ్స్ జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 24 క్రీడల్లో కాంపిటీటివ్ స్పోర్ట్స్, 18 బాల్ స్పోర్ట్స్, 9 అడ్వర్సరీ స్పోర్ట్స్, 10 వాటర్ స్పోర్ట్స్ పోటీలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 8వ తేదీతో ముగియనున్నాయి. మొత్తం 35 స్పోర్టింగ్ ఈవెంట్లలో దేశం తరఫున 653 మంది క్రీడాకారులు తరలివెళ్లగా.. వారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన 16 మందిలో విశాఖ క్రీడాకారులు నలుగురున్నారు. వారిలో ముగ్గురు వుమెన్ కాగా.. ఒకరు మెన్. వీరందరికి ఇదే తొలి ఆసియాడ్. వీరంతా విజయకేతనం ఎగురవేసి మువ్వన్నెల జాతీయ పతాకను విశ్వవిను వీధిలో రెపరెపలాడించి తిరిగి రావాలంటూ ఆకాంక్షిద్దాం.

విశాఖ నుంచి పతకం కోసం మరోసారి..


స్కేటర్ గ్రీష్మ


స్కేటర్ సాయిసంహిత

ఆసియాడ్ రోలర్ స్కేటింగ్‌లో విశాఖ మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమైంది. విశాఖ చిన్నారులు సాయిసంహిత, గ్రీష్మ భారత్ తరఫున మహిళల ఆర్టిస్టిక్ విభాగం వ్యక్తిగత పోటీల్లో తలపడనున్నారు. వీరిద్దరూ నాలుగేళ్ల ప్రాయంలోనే కాళ్లకు చక్రాలు కట్టుకున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధిస్తూ ఆసియాడ్‌కు ఎంపికై ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. విజయం సాధించి జాతీయ పతకాన్ని రెపరెపలాడిస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. 6వ తేదీన జరగనున్న మహిళల ఆర్టిస్టిక్ సింగిల్ ఫ్రీ స్కేటింగ్‌లో సాయిసంహితతో పాటు గ్రీష్మ సైతం ఈవెంట్‌లో భారత్ తరఫున పోటీ పడనున్నారు. ప్రస్తుత ఆసియాడ్‌లో పతకాలు సాధిస్తే విశాఖ నుంచి మరోసారి పతకాలు సాధించిన స్కేటర్లుగా నిలవనున్నారు. విశాఖ స్కేటర్లు అరుణ్-పాంచాల్ జోడి గతంలోనే ఆసియాడ్‌లో పతకం సాధించింది.

విశాఖలో రాకెట్ పట్టి.. ప్రొఫెషనల్‌గా అమెరికాకు..



మైనేని సాకేత్ చిన్నతనంలో రాకెట్ చేతబట్టింది విశాఖలోనే. క్రమంగా టెన్నిస్‌నే కెరీర్‌గా ఎంచుకుని మెరుగైన శిక్షణ కోసం ఢిల్లీకి మకాం మార్చాడు. జాతీయ స్థాయిలో రాణిస్తూ అక్కడి నుంచే అమెరికాకు వెళ్లి ఏటీపీ టూర్స్ డబుల్స్‌లో పాల్గొన్నాడు. ఏకంగా గత నెలలో యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లో పోటీ పడ్డాడు. యూఎస్ డాలర్ల రూపంలోనే ప్రైజ్‌మనీని సొంతం చేసుకుంటూ (లక్ష డాలర్ల నగదు ప్రోత్సాహం) దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం డబుల్స్‌లో 84వ ర్యాంక్‌లో ఉన్నా.. కెరీర్ బెస్ట్‌గా 74వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

సాకేత్ సెమీస్‌కు ఇలా..

టెన్నిస్ మెన్ డబుల్స్‌లో రామనాథన్‌తో జోడి కట్టిన సాకేత్(ఇండియా-2) ఆరంభ మ్యాచ్‌లో నేపాల్ జోడిపై రెండు స్ట్రయిట్ సెట్స్‌లోనే విజయం సాధించి శుభారంభం చేసింది. రెండో రౌండ్‌లోనూ ఇండోనేషియాపైనా స్ట్రయిట్ సెట్స్‌లోనే విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఆతిథ్య చైనా(చైనా-1) జట్టుపై తొలి సెట్‌ను సునాయాసంగానే గెలిచినా రెండో సెట్‌లో చెమటోడ్చి 7-6(8)తో మ్యాచ్ డిసైడ్ చేసేసి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. సెమీస్‌లో కొరియా-1 జట్టుతో గురువారం రాత్రి తలపడనుంది.

హార్డిల్స్‌లో 'జ్యోతి'

హార్డిల్స్‌లో తన జాతీయ రికార్డునే తిరగరాసిన జ్యోతి.. ఈసారి ఆసియన్ బెస్ట్‌గా నిలిచేందుకు సిద్ధమైంది. ఆసియన్ చాంపియన్‌షిప్‌కు భిన్నంగా ఆసియాలోని ప్రతీ దేశం పోటీపడే ఆసియన్ గేమ్స్‌లో పతకం సాధించి ఫాస్టెస్ట్ హార్డిలర్ రికార్డును సొంతం చేసుకోవడమే లక్ష్యమంటుంది విశాఖ అథ్లెట్ జ్యోతి. జాతీయ స్థాయిలో పాల్గొన్న మీట్స్‌లో రికార్డులు నెలకొల్పిన ఈమె ఆసియన్ చాంపియన్‌షిప్‌లోనూ అర్ధ శతాబ్దపు భారత్ వ్యక్తిగత స్వర్ణ పతక ఆశను నెరవేర్చి, ఫాస్టెస్ట్ రికార్డు సొంతం చేసుకుంది. ఇటీవల ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పాల్గొని కాస్త తడబడినా.. అథ్లెట్ల సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన జ్యోతి అదే అనుభవంతో ఈసారి ఆసియాడ్‌లో పతకం కంటే 13 సెకన్లపైనే దృష్టి పెట్టి విజేతగా నిలవాలనే ఆకాంక్ష వ్యక్తం చేస్తోంది. 30వ తేదీ శనివారం ఉదయం సెషన్‌లో ఆమె ట్రాక్‌లోకి దిగనుంది.


హార్డిలర్ జ్యోతి

హృదయం.. పదిలమేనా?

- ఆందోళన కలిగిస్తున్న గుండె పోటు మరణాలు
- యుక్త వయసులోనే తనువు చాలిస్తున్న పలువురు
- జీవనశైలి, ఆహారంలో మార్పులే కారణమంటున్న వైద్యులు



మహారాణిపేట: జీవన శైలిలో మార్పులు, అధిక బరువు, రక్తపోటు, మధుమేహం తదితర సమస్యలతో గుండె లయ తప్పుతోంది. నిమిషానికి 72 సార్లు కొట్టుకోవాల్సిన హృదయం కొన్ని సార్లు మొరాయిస్తోంది.. మరికొన్ని సార్లు అతివేగంగా కొట్టుకుంటోంది. గతంలో 45 ఏళ్లు దాటాక గుండె పోటు వచ్చేది. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా వచ్చే వ్యాధుల్లో ఎక్కువగా గుండె పోటు పేరే వినిపిస్తోంది. ఈ రోజు వరల్డ్ హార్ట్ డే. గుండెను ఎంత ప్రమాదంలోకి నెడుతున్నామో తెలుసుకోవాల్సిన సమయం ఇదే.!

కేజీహెచ్‌లో 24X7 సేవలు

కేజీహెచ్‌లో రెండు కార్డియాలజీ యూనిట్లు ఉన్నాయి. మొదటి యూనిట్ విభాగాధిపతిగా డాక్టర్ బి.ఆదిలక్ష్మి, రెండో యూనిట్ విభాగాధిపతిగా డాక్టర్ మల్లాది శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. వీరికి అసోసియేట్ ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సహాయంగా ఉంటున్నారు. ఐసీయూలో 13 పడకలు ఏర్పాటు చేశారు. కార్డియాలజీ ఓపీకి

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



కేజీహెచ్‌లో కార్డియాలజీ విభాగం

ప్రతి రోజూ 200 నుంచి 300 మంది రోగులు వస్తుంటారు. గుండెనొప్పి, ఆయాసం, గుండెల్లో నలత, గుండె పట్టేయడం తదితర కారణాలతో పరీక్షలు చేయించుకుంటున్నారు. గతంలో రోగులు మందులు, ఇతర వైద్య పరికరాలను బయట కొనుగోలు చేసేవారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత గుండెకు సంబంధించి అవసరమైన 8 రకాల మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ఇక్కడ నెలకు 100 ఎంజియోగ్రామ్, 40 స్టంట్‌లు, 30 తాత్కాలిక పేస్ మేకర్లు, 15 శాశ్వత పేస్‌మేకర్లు ఉచితంగా అమర్చుతున్నారు. వేల రూపాయల్లో ఉండే మందులు, ఇంజక్షన్లను రోగులకు ఉచితంగా ఇస్తున్నారు. గుండెకు నీరు చేరడం, గుండెకు కన్నం పడడం తదితర సమస్యలకు కూడా ఇక్కడ వైద్య సేవలందుతున్నాయి.

ఒత్తిడికి గురికావద్దు



ప్రతీ మనిషి జీవితంలో ఒత్తిడి సహజం. ఒత్తిడిని నియంత్రించడం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చు. ఇందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ధాన్యం, యోగా వంటివి ఉపయుక్తంగా నిలుస్తాయి. గతంలో పోలిస్తే యువకుల్లో గుండె పోట్లు పెరుగుతున్నాయి. కరోనా తర్వాత అవి మరింత ఎక్కువయ్యాయి. రాత్రి నిద్ర తక్కువ పోవడం వల్ల పగలు ఒత్తిడి పెరుగుతుంది. కనీసం రోజుకు 6-7 గంటలు నిద్రపోవాలి. 45 నిమిషాలు నడవాలి. గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి.

–ప్రొఫెసర్ డాక్టర్ ఆదిలక్ష్మి, కార్డియాలజీ విభాగం, కేజీహెచ్

ఆహార నియమాలతో వ్యాధులు దూరం



గుండెపోటుకు ఎంత త్వరగా చికిత్స ఆరంభిస్తే అంత మంచిది. గుండె పోటుతో రక్తం సరఫరా నిలిచిపోయినప్పుడు ఈ భాగంలోని కండరం దెబ్బతిని చివరికి చచ్చుబడుతుంది. ఈ లోపు చికిత్స మొదలు పెడితే కండరం మరింత దెబ్బతినకుండా, సమస్య తీవ్రం కాకుండా ఉంటుంది. గుండె, రక్తనాళాల సంబంధిత వ్యాధులను 80 శాతం వరకు నివారించవచ్చు. ఏదైనా అతిగా చేయడం వల్ల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. మద్యంగానీ, ఆహారం గానీ అతిగా తీసుకోవడం వల్ల ఆ ప్రభావం గుండె మీద పడుతుంది. ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత వ్యాధుల గురించి తెలుసుకోవాలి. దురాలవాట్లకు దూరంగా ఉండటం, బీపీ, కొలస్ట్రాల్, మధుమేహాన్ని నియంత్రించుకోవడం, చక్కటి ఆహార నియమాలు పాటిస్తే గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చు. ఏటా లేదా రెండేళ్లకు ఒకసారి గుండె పరీక్షలు చేయించుకోవాలి. వాయు కాలుష్యం వల్ల కూడా 25 శాతం మందిలో గుండె జబ్బులు సంభవిస్తున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది.

– డాక్టర్ ఎస్.సి.సిన్హా, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, స్టార్ పినాకిల్ హార్ట్ సెంటర్

వాలీబాల్ పోటీలు, ఎంపికలు వాయిదా

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా సారథ్యంలో ఈనెల 29వ తేదీన పాడేరులోని తలారిసింగ్ క్రీడా మైదానంలో నిర్వహించాల్సిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వాలీబాల్ (అండర్-14) పోటీలు, ఎంపికలు వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసినట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి, విశాఖ, ఏఎస్ఆర్ జిల్లాల కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, ఎం.వి.నాగేశ్వరరావు, పి.సూరిబాబు తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, మూడు జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలని వారు కోరారు.

ఏయూలో హాస్టల్ సముదాయం ప్రారంభం

- ఎకో ఫ్రెండ్లీ వాహనాన్ని ఏయూకు అందించిన ఐతం
- పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


ఆధునికీకరించిన హాస్టల్ సముదాయాన్ని ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి తదితరులు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాడు-నేడు పనుల్లో భాగంగా ఆధునీకరించిన శ్రీకృష్ణదేవ రాయ వసతి గృహం (ఎస్‌కేడీ హాస్టల్)ను వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. నాడు- నేడు పనుల్లో భాగంగా ఈ హాస్టల్‌లో 240 గదులను ఆధునీకరించినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. మంచినీటి సౌకర్యం, విద్యుత్, టాయిలెట్ సౌకర్యాలను ఆధునికంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమం అనంతరం సుబ్బారెడ్డి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఐతం) విద్యార్థులు రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ వాహనాన్ని ప్రారంభించారు. ఐతం విద్యార్థులు రూపొందించిన ఈ ఇంధన రహిత వాహనాన్ని ఆ కళాశాల యాజమాన్యం ఏయూకు అందజేసింది. వివిధ అవసరాల నిమిత్తం వర్సిటీని సందర్శించే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం దీన్ని ఉపయోగించనున్నారు. పర్యావరణ హితమైన ఇలాంటి వాహనాలను మరిన్ని అందుబాటులోకి తేవాలని వైవీ సుబ్బారెడ్డి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య షారోన్‌రాజు, ఆచార్య సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హౌసింగ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

డాబాగార్డెన్స్: విశాఖ అక్రిడిటేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్(వీఏడబ్ల్యూజేహెచ్) సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రారంభమైంది. పలువురు అక్రిడేటెడ్ జర్నలిస్టుల నుంచి సభ్యత్వ నమోదు దరఖాస్తులు స్వీకరించారు. శుక్ర, శనివారాల్లో కూడా నమోదు ప్రక్రియ ఉంటుందని సొసైటీ అధ్యక్షుడు బి.రవికాంత్, కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. సభ్యత్వ నమోదుకు అక్రిడిటేషన్ కార్డు, ఆధార్ కార్డ్ జెరాక్స్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.


సభ్యత్వ రశీదు అందిస్తున్న విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న యువకుడ్ని టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన జగదీష్ యాదవ్(45) (పాన్ మసాల వ్యాపారి), మరో వ్యక్తి ఆనంద్ కలిసి భువనేశ్వర్ వెళ్లి 7.5 కిలోల గంజాయి తీసుకువచ్చారు. రామాటాకీస్ దగ్గర బస్సు ఎక్కేందుకు నిరీక్షిస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. అటువైపుగా వెళ్తున్న టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథ్ తన సిబ్బందితో తనిఖీలు చేయడంతో బ్యాగులో 7.5 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. జగదీష్‌ను అదుపులోకి తీసుకుని ద్వారకా పోలీసులకు అప్పగించారు. ఆనంద్ పరారయ్యాడు.

అనుమానాస్పదంగా పెళ్లికుమార్తె తండ్రి మృతి

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో అనుమానాస్పదంగా పెళ్లి కుమార్తె తండ్రి మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన అచ్చిరెడ్డి వెంకటేశ్వరరావు(65) తన కుమార్తె పెళ్లి నిమిత్తం కుటుంబంతో కలిసి విశాఖ వచ్చారు. నగరానికి చెందిన వ్యక్తితో బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో బుధవారం రాత్రి కుమార్తె వివాహం ఘనంగా జరిపించారు. ఆ సమయంలో వెంకటేశ్వరరావుకు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అయితే అమెరికాలో ఉంటున్న వెంకటేశ్వరరావు కుమారుడు.. తన తండ్రి మృతిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

కేంద్ర మంత్రికి సాదర స్వాగతం

గోపాలపట్నం: కేంద్ర రైల్వే సహాయ మంత్రి దర్శన విక్రమ్ జర్దోష్‌కు విశాఖ విమానాశ్రయంలో గురువారం సాదర స్వాగతం లభించింది. మూడు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ వచ్చిన ఆమెకు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహూ, బ్రాండెక్స్ ఇండియా టెక్స్‌టైల్ ప్రతినిధులు స్వాగతం పలికారు.


విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న కేంద్ర మంత్రి దర్శన్ జర్దోష్

స్వర్ణకాంతుల చంద్రుడు

కళ్లు మిరిమిట్లు గొలిపే స్వర్ణకాంతితో చంద్రుడు.. ధగ ధగా మెరిసిపోతూ.. గుండ్రంగా.. పరిపూర్ణంగా గురువారం రాత్రి దర్శనమిచ్చాడు. ఇది చూసిన నగర వాసులు తన్మయత్వం పొందారు.

-ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్



పోలీసుల అదుపులో భార్యాభర్తలు

అల్లిపురం: పిల్లలను విక్రయిస్తున్నారన్న అనుమానంతో ముగ్గురు పిల్లలతో సహా భార్యాభర్తలను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. జైలురోడ్డులో గల నైట్ ఫుడ్‌కోర్టులో ఓ మహిళ, ఓ వ్యక్తి పిల్లలను విక్రయిస్తున్నారని గురువారం రాత్రి డయల్ 100కు సమాచారం రావటంతో టూటౌన్ ఏఎస్ఐ తులసిగిరి తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. వారి వద్ద 16 రోజుల చిన్నారితో పాటు మరో ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఒకరిని రూ.3 లక్షలకు, మరొకరిని రూ.50 వేలకు విక్రయిస్తామని ఫుడ్‌కోర్టుకు వచ్చిన వారిని అడిగినట్లు స్థానిక వ్యాపారులు తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని టూటౌన్‌కు తరలించారు. వారు భార్యభర్తలని, భార్యది మద్దిలపాలెం కాగా భర్తది హైదరాబాద్ అని పోలీసులు తెలిపారు. షెల్టర్ లేక అక్కడకి వచ్చామని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. పిల్లలను చైల్డ్‌లైన్‌కు అప్పగించేందుకు సమాచారం అందజేశామన్నారు.


భార్యాభర్తలను విచారిస్తున్న పోలీసులు

స్నేహితుడిని హత్య చేసిన నిందితుడు అరెస్ట్

సీతమ్మధార: స్నేహితుడిని హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడు శివకుమార్(అలియాస్ శివారెడ్డి)ని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. సీతంపేటకు చెందిన కిశోర్‌కుమార్(26) నగరంలోని ఒక ప్రైవేట్ సంస్థలో సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శంకరమఠం రోడ్డులో స్నేహితుడు ఆదివారం నిర్వహించిన వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న కిశోర్ అదే ప్రాంతంలో ఉంటున్న దయ, కిరణ్, శివారెడ్డితో కలిసి మద్యం సేవించారు. రాత్రి 8 గంటల సమయంలో కిశోర్ తన ఇంటికి వెళ్లిపోయాడు. మళ్లీ ఫోన్ రావడంతో శ్రీనగర్‌లో ఉన్న శివారెడ్డి ఇంటికి వెళ్లాడు. మూడో అంతస్తులో నలుగురూ మరోసారి మద్యం సేవించారు. తన భార్య వేరే వ్యక్తితో మాట్లాడానికి ప్రోత్సహిస్తున్నాడన్న అనుమానంతో కిశోర్‌ని మాట్లాడాలని పక్కకు పిలిచిన శివారెడ్డి మేడపై నుంచి తోసేసి పరారయ్యాడు. తోటి స్నేహితులు కిశోర్‌ని కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. శివారెడ్డి తునిలో దాబాలో పని చేస్తున్నాడు. ఏసీపీ వివేకానంద ఆధ్వర్యంలో సీఐ సీహెచ్.సింహాద్రినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశాఖ రైల్వేస్టేషన్ రోడ్డులో శివారెడ్డి ఉన్నట్లు గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు.

హత్యా? ఆత్మహత్యా..

సాగర్‌నగర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి


సాగర్‌నగర్ రోడ్డుపై మృతి చెందిన ఆనందరావు


మృతదేహం వద్ద విలపిస్తున్న ఆనందరావు కుటుంబ సభ్యులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లో ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ మాంసం దుకాణాల సముదాయం వద్ద రోడ్డుపై గురువారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం ఉంది. స్థానికులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ అప్పారావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న కీప్యాడ్ ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించారు. మృతుడు అరకు, బొర్రాకు మధ్య ఉన్న జయంతివలస గ్రామానికి చెందిన సిరిగపు ఆనందరావు(35)గా గుర్తించారు. భార్య పద్మతో కలసి కంచరపాలెంలో నివాసం ఉంటూ రైల్వే న్యూకాలనీ సమీపంలో ఫ్లవర్ డెకరేషన్‌లో పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇదిలా ఉండగా ఆనందరావు ప్రమాదవశాత్తు చనిపోయాడా? లేక ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంచరపాలెంలోనో, రైల్వే న్యూకాలనీలో ఉండాల్సిన వ్యక్తి రాత్రి సమయంలో సాగర్‌నగర్‌కు ఎందుకు వచ్చాడన్న కారణం ఎవరికి తెలియలేదు. మృతుడి తలపై బలమైన గాయాలు, రక్తస్రావం అయిన జాడలు ఉన్నాయి. తల వెనక భాగంలో గాయాలు ఉన్నాయి. హత్యా? లేక ఆత్మహత్యా? అనే కోణంలో ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

చెక్కు చెదరనిది సనాతన ధర్మం


కవితా గోష్టిలో పాల్గొన్న కవులతో లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాస్వామి

సీతంపేట: కాలాన్ని బట్టి కొన్ని విలువలు మారినా.. ధర్మం మారదని కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠంలో గురువారం జరిగిన కవి సమ్మేళనంలో స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. సనాతన ధర్మమంటే ప్రాచీన కాలం నుంచి కొనసాగుతూ నిత్యం సత్యమైనదన్నారు. భారతదేశంపై ఎన్ని విదేశీ దురాక్రమణలు జరిగినా.. మన ధర్మం చెక్కు చెదరలేదని చెప్పారు. ఈ సందర్భంగా తరంగిణి ఆధ్యాత్మిక గ్రంథాన్ని స్వామీజీ ఆవిష్కరించారు. పీఠంలో సనాతన ధర్మంపై జరిగిన కవితా గోష్టిలో 17 మంది కవులు పాల్గొని తమ కవిత్వంతో సభికులను అలరించారు. టీపీఎస్ ఆచార్యులు, డాక్టర్ డి.వి.సూర్యారావు పర్యవేక్షించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ చేతుల మీదుగా కవులను సత్కరించారు.